పడితే ఇక లెగరు..!



వరహాపురం రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న గుంతలు

వేమూరు: ఆర్‌అండ్‌బీ రహదారి అధ్వానంగా మారింది. రోడ్డులో ఉన్న గోతిలో పడితే ఇక అంతే సంగతులు. వేమూరు నుంచి వరహాపురం వెళ్లు రోడ్డులో రైస్ మిల్లు వద్ద రెండు భారీ గోతులు పడ్డాయి. రాత్రిళ్లు ద్విచక్ర వాహనదారులు ప్రమాదానికి గురయ్యే అవకాశం అధికంగా ఉంది. ఈ గోతుల కారణంగా విద్యార్థుల బస్సులు కూడా వెళ్లడం లేదు. రైస్ మిల్లు వద్దకు వెళ్లే లారీలు ఈ గోతిలో పడి ఇరుక్కుపోతున్నాయి. వరహాపురం గ్రామానికి చెందిన 30 మంది విద్యార్థుల కోసం బస్సు వెళ్లలేకపోవడంతో తల్లిదండ్రులు ద్విచక్ర వాహనాలు, సైకిల్‌పై తమ పిల్లలను ఇక్కడికి తీసుకొచ్చి, బస్సు ఎక్కిస్తున్నారు. అర్ అండ్ బీ అధికారులు స్పందించి ఈ గోతులను పూడ్చాలని కోరుతున్నారు. అధికారులు పట్టించుకోక పోతే అందోళన చేస్తామంటున్నారు.

ప్రమాదం పొంచి ఉంది



ప్రధాన రహదారిపై భారీ గోతులు పడటంతో వాహనదారులు భయపడుతున్నారు. ఎక్కడ అందులో పడి..క్షతగాత్రులం అవుతామోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అర్‌అండ్‌బీ అధికారులు మరమ్మతులపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.

– యల్లమాటి రమేష్‌బాబు, వరహాపురం

వైభవంగా చెన్నమల్లేశ్వరునికి పూజలు



రేపల్లెలో దేదీప్యమానంగా చెన్నమల్లేశ్వరస్వామి దర్శనం



దీపారాధన చేస్తున్న మహిళలు

రేపల్లె రూరల్: పవిత్ర కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ఇసుకపల్లిలోని చెన్నమల్లేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామికి వేకువ జామునే పంచామృతాలు, పండ్ల రసాలతో అభిషేకాలు నిర్వహించి, పట్టువస్త్రాలతో అలంకరించారు. కార్తిక దీపాల నడుమ చెన్నమల్లేశ్వరస్వామి భక్తులకు ప్రత్యేక దర్శనమిచ్చారు. భక్తులు స్వామి వారికి పువ్వులు, మారెడు దళాలను సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అదేవిధంగా మోర్తోట గ్రామంలోని ముక్తేశ్వరస్వామి ఆలయం, రేపల్లె రైలు పేటలోని స్వయంభూ రామలింగేశ్వరస్వామి ఆలయం, ఓల్డ్ టౌన్‌లో ఉమామహేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చుండూరు(వేమూరు): చుండూరు మండలంలోని చినపరిమి గ్రామంలో కామలింగేశ్వర స్వామి దేవస్థానంలో రెండవ సోమవారం కార్తిక మాసం పూజలు నిర్వహించారు. దేవస్థానంలో పూజలు చేసి, సాయంత్రం భక్తులు దీపారాధన చేశారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఐదు అర్జీలు



అర్జీలను పరిశీలిస్తున్న ఆర్డీవో నేలపు రామలక్ష్మి

రేపల్లె రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఐదు అర్జీలు అందినట్లు ఆర్డీవో నేలపు రామలక్ష్మి చెప్పారు. పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం మాట్లాడారు. అన్యాక్రాంతమైన భూమిని ఇప్పించాలని కొల్లూరు మండలం ఈపురులంక గ్రామానికి చెందిన కలపాల పెద్దయ్య అర్జీ ఇచ్చినట్లు చెప్పారు. నిజాంపట్నం మండలం అడవుల దీవిలోని సత్రంకు చెందిన 71 సెంట్లు భూమి మాత్రమే ఆన్‌లైన్ చేయబడిందని, మిగిలిన 20 సెంట్లను ఆన్‌లైన్ చేయాలని గ్రామానికి చెందిన ఒడుగు రాంబాబు దరఖాస్తు చేశారని చెప్పారు. అదేవిధంగా భూ పట్టా కోసం ఓలేరు గ్రామం నుంచి ఒక దరఖాస్తు అందగా, అదే గ్రామం నుంచి విశ్రాంత ఉద్యోగి ఓలేటి వీరరాఘవయ్య తనకు 2022 నుంచి బకాయిలు చెల్లించాలని కోరుతూ అర్జీ చేసుకున్నారని చెప్పారు. రేపల్లె మండలం నల్లూరు నార్త్ గ్రామంలో కొల్లి శేషు కృష్ణ అనే వ్యక్తి గత 20 సంవత్సరాలుగా నీటి తీరువా బకాయిలు చెల్లించలేదని, అనుమతి లేకుండా పంట భూములను రొయ్యల చెరువులుగా మార్పుతున్నాడని, 20 ఎకరాల భూమిలో మట్టిని తవ్వి అక్రమంగా అమ్ముకుంటున్నాడని దీనిపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన పుట్టగుంట బుచ్చిరామయ్య పిర్యాదు చేశారన్నారు. సమస్యలను పరిశీలించి, ఆయా శాఖల అధికారులు పరిష్కరించడం జరుగుతుందని ఆర్డీఓ తెలిపారు.

రోడ్లు, మురుగు కాల్వలు నిర్మించండి



కమిషనర్ శేషన్నకు వినతిపత్రం ఇస్తున్న పట్టణవాసులు

తెనాలిఅర్బన్: బాలాజీరావుపేటలో రోడ్లు, కాల్వలు నిర్మించాలని బాలాజీరావుపేట వాసులు కోరారు. మున్సిపల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతిలు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. శాంతినగర్‌లో రక్షిత మంచి నీటి పథకం పైపులైన్‌లో ఏర్పాటు చేసినప్పటికి ఇంటింటికి కనెక్షన్‌లు ఇవ్వలేదని, వాటిని ఇప్పించే విధంగా చూడాలని పలువురు కోరారు. అలాగే బీసీ కాలనీలో ఖాళీస్థలాల్లో పిచ్చిమొక్కలు పెరగడం వలన ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వాటిని తొలగించాలని, పింఛన్‌కు తనకు అర్హతు ఉందని దానిని ఇప్పించాలని మరొకరు కోరారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

సైబర్ నేరస్తులతో జాగ్రత్త

కొల్లిపర: మండల పరిధిలోని ప్రజలందరూ సైబర్ నేరస్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఎస్ఐ కోటేశ్వర రావు తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ ఎవరైనా ఫొన్ చేసి మేము బ్యాంక్ నుంచి పోన్ చేస్తున్నాము. మీ అకౌంట్ గానీ లేదా క్రెడిట్ కార్డు , ఆధార్ కార్డు గానీ రెన్యూవల్ చేస్తాము మీకు ఓటీపీ వస్తుంది నెంబర్ చెప్పండని అడిగితే అటువంటి వారికి ఎటువంటి సమాధానం చెప్పకుండా వెంటనే జాగ్రత్త వహించాలని వారు తెలిపారు. ప్రజలు తమ ప్రమేయం లేకుండా బ్యాంక్ ఖాతాలలో నగదు వేరే ఖాతాలకు బదిలీ అయినట్లుగా ఫోన్‌కు మేసేజ్ వస్తే వెంటనే కేంద్ర సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ 1930 నెంబర్ కు ఫోన్ చేసి తమకు జరిగిన మోసాన్ని వివరించాలన్నారు. అలాగే చేస్తే సైబర్ నేరస్తుల అకౌంట్ నుంచి డబ్బులు డ్రా కాకుండా అడ్డుకునే వీలుంటుందని వారు తెలిపారు.

సమస్యల పరిష్కారం కోరుతూ 8 అర్జీలు

తెనాలి: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వివిధ ప్రాంతాల్నుంచి వచ్చిన ప్రజలు ఎనిమిది అర్జీలు సమర్పించారు. సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహ అర్జీలను స్వీకరించారు. వీటిలో రెవెన్యూకు సంబంధించి నాలుగు, పోలీస్‌శాఖ పరిధిలో ఒకటి, డివిజన్ పంచాయతీ అధికారి పరిధిలోకి వచ్చే మరొక అర్జీ, డీటీఏకు సంబంధించి ఇంకొక అర్జీని అందజేశారు. ఆయా శాఖల ఉన్నతాధికారులకు అర్జీలను పంపించి నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ తెలిపారు.

హేమలత టీచర్‌కు హెచ్‌ఎంగా పదోన్నతి



తెనాలి: స్థానిక చెంచుపేటలోని కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూలులో 2000 సంవత్సరం నుంచి భౌతికశాస్త్ర స్కూల్ అసిస్టెంటుగా పనిచేస్తున్న నాగభైరు హేమలతకు ప్రధానోపాధ్యాయినిగా పదోన్నతి లభించింది. నిడుబ్రోలు మున్సిపల్ హైస్కూలుకు వెళుతున్న సందర్భంగా సోమవారం ఇక్కడి స్కూలులో ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు రాజారెడ్డి, స్టాఫ్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, కార్యదర్శి పద్మ, సీనియర్ ఉపాధ్యాయులు అంబరీషుడు, శైలజ, సుభాష్ చంద్రబోస్, రమేష్, ఇతర ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాఠ్యాంశాలను ఇష్టపడి అభ్యసించాలి



నిజాంపట్నం: విద్యార్థులు పాఠ్యాంశాలను కష్టపడకుండా ఇష్టపడి అభ్యసిస్తే ఆయా అంశాలు తమ మనస్సులో జీవితాంతం నిలిచిపోతాయని కెమిస్ట్రీ అధ్యాపకుడు, పూర్వ విద్యార్థి ఏఎస్ఎస్ శంకరరావు అన్నారు. రసాయన శాస్త్రంలో మూలకాలు సులభంగా గుర్తుంచుకునే విధానంపై మండలంలోని అడవులదీవి జెడ్పీ హైస్కూల్లో సోమవారం 9, 10, ఇంటర్మీడియల్ విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భయంతోనే అతి సులభమైన రసాయన శాస్త్రం భారంగా భావిస్తారని, నేర్చుకునే విధానంలో మూలకాలను, అంశాలను తెలుసుకుంటే ఎంతో ఆసక్తిదాయకంగా ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులకు సులభంగా 60 మూలకాల పేర్లను గుర్తుచుకునే విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బి.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు వైపీ మాణిక్యారావు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి



బాపట్లటౌన్: విద్యార్థి దశనుంచే చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని నారాయణ హైస్కూల్ ప్రిన్సిపాల్ భాగ్యరాణి తెలిపారు. ఇటీవల మంగళగిరిలో జరిగిన 9వ జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో తమ విద్యార్థులు గోల్డ్‌మెడల్ సాధించారన్నారు. బాలుర విభాగంలో అండర్ 11లో టీమ్ కాటా విభాగంలో ఈశ్వర్, హర్ష, విజయ్, అయ్యప్పలు గోల్డ్ మెడల్స్ సాధించారన్నారు. సింగిల్ కాటా విభాగంలో బ్రాంజ్ మెడల్స్ సాధించారన్నారు. బాలికల విభాగంలో రేవతి, అమీనాలు టీమ్ కాటా విభాగంలో గోల్డ్‌మెడల్, సింగిల్ కాటా విభాగంలో బ్రాంజ్ మెడల్స్ సాధించారన్నారు. అవార్డులు సాధించిన విద్యార్థులను సోమవారం పాఠశాలలో అభినందించారు. ఈ కార్యక్రమంలో కోచ్ ఉమా మహేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వితలేశ్వరునికి దీపోత్సవం



భట్టిప్రోలు: దేవతల గుడిగా ప్రసిద్ధి గాంచిన గంగా పార్వతి సమేత వితలేశ్వర స్వామి దేవస్థానంలో కార్తిక సోమవారం పురస్కరించుకుని శివలింగాకారంలో దిపోత్సవం చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ఆరేపల్లి నాని దంపతులు ఈ దీపోత్సవం నిర్వహించారు. స్వామివారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని తమ భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. కార్తిక సోమవారం నోములు నోచుకున్న భక్తులు దేవాలయాలలో పూజలు నిర్వహించారు. ఉదయం, సాయంత్రం నుంచి రాత్రి వరకు వితలేశ్వర స్వామి దేవస్థానం భక్తులతో కోలాహలంగా మారింది.

డ్రైవర్లు అప్రమత్తంగా ఉన్నప్పుడే ఆర్టీసీ అభివృద్ధి

డిపో మేనేజర్ శ్రీమన్నారాయణ



బాపట్లటౌన్: డ్రైవర్లు అప్రమత్తంగా ఉన్నప్పుడే ఆర్టీసీ సంస్థ అభివృద్ధి బాటలో పయనిస్తుందని డిపో మేనేజర్ శ్రీమన్నారాయణ తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ గ్యారేజ్‌లో గత 40 రోజుల నుంచి జరుగుతున్న 19వ బ్యాచ్ డ్రైవర్ల శిక్షణా తరగతులు సోమవారంతో ముగిశాయి. శ్రీమన్నారాయణ మాట్లాడుతూ డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ డ్రైవింగ్ చేస్తే ఎలాంటి ప్రమాదాలు జరగవన్నారు. డ్రైవర్లకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం శిక్షణ పూర్తిచేసుకున్న డ్రైవర్లకు సర్టిఫికేట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గీతా జ్ఞాన కర్పూర యజ్ఞం

భట్టిప్రోలు: సాధన మండలి బ్రహ్మ విద్యాశ్రమంలో మంగళవారం చాతుర్మాస్య వ్రత దీక్ష సమాప్తం, 247వ గీతా జ్ఞాన కర్పూర యజ్ఞం జరుగుతుందని నిర్వాహకులు బూర్లె అరుణ కుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం జరిగే గీతా జ్ఞాన కర్పూర యజ్ఞంలో పలువురు దంపతులు పాల్గొంటారని పేర్కొన్నారు. జప విరమణ, షడక్షరీ మంత్ర జపం విడుదల, మధ్యాహ్నం దీపోత్సవం, సమారాధన జరుగుతుందని వెల్లడించారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి

రేపల్లె రూరల్: పురపాలక సంఘ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు కోరారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ పురపాలక సంఘం పరిధిలోని ఇంటి పన్ను, నీటి పన్ను, ఖాళీ స్థలం పన్నులు అధికంగా ఉన్నాయన్నారు. పట్టణ ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి, అభివృద్ధికి సహకరించాలన్నారు. డిసెంబర్ 31 లోపు నీటి పన్ను చెల్లించని వారి కనెక్షన్‌లను తొలగించటం జరుగుతుందన్నారు. పట్టణంలోని ఖాళీ స్థలాల యజమానులకు ఇప్పటికే నోటీసులు జారీ చేశామన్నారు. యజమానులు సకాలంలో పన్ను చెల్లించాలని ఆదేశించారు.

వ్యక్తిపై కేసు నమోదు

రేపల్లెరూరల్: మొబైల్ దుకాణంలో మొబైల్ ఫోన్‌లు విక్రయించగా వచ్చిన సొమ్మును స్వాహా చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేశారు. సీఐ మల్లికార్జునరావు వివరాల మేరకు పట్టణంలోని సంగీత మొబైల్స్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్న వరిగంచి కమలాకర్ దుకాణంలో మొబైల్స్ విక్రయించిగా వచ్చిన రూ.13,42,671ల నగదును సంస్థకు అప్పగించకుండా తన వ్యక్తిగత ఖర్చులకు వాడుకున్నాడన్నారు. ఈ విషయమై ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల సంగీత మొబైల్స్ మేనేజర్ పులి నరేంద్ర కుమార్ పిర్యాదు మేరకు కేసు మోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

ఎమ్మార్పీఎస్ మహా సభల కరపత్రాల ఆవిష్కరణ



రేపల్లె రూరల్: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఏర్పడి 30 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ నెల 16న విజయవాడలో తలపెట్టిన మహా సభను జయప్రదం చేయాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ నాయకులు రేపల్లెలో కరపత్రాలను ఆవిష్కరించారు. సోమవారం పట్టణంలోని బస్టాండ్ సెంటరులో ఉన్న బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో దున్నా రాబర్ట్ మాట్లాడుతూ ఉద్యమ పోరాటంలో మాదిగ జాతి అభివృద్ధికై అమరులైన ముద్దు బిడ్డలను స్మరించుకుంటూ భవిష్యత్‌లో నిర్వహించాల్సిన కార్యాచరణ ప్రణాళికను నిర్దేశించుకోవటానికి జరిగే మహా సభలో మాదిగ జాతి ప్రజలు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏటుకూరి విజయ్‌కుమార్, శ్రీనివాస్, నాగరాజు, భూషణం, బుజ్జిబాబు పాల్గొన్నారు.

తెనాలిలో మునిసిపల్ ఎస్ఈ పర్యటన

తెనాలిఅర్బన్: పట్టణంలో మున్సిపల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ దాసరి శ్రీనివాసరావు సోమవారం సాయంత్రం పర్యటించారు. అమృత-2 పథకంలో ప్రతిపాదనలు పంపిన పలు స్థలాలను ఆయన పరిశీలించారు. బస్టాండ్ అవుట్ గేట్ ఎదురు ఉన్న మున్సిపల్ స్థలాన్ని, రామలింగేశ్వరపేటలోని ఓపెన్ ఆడిటోయంను పరిశీలించారు. అక్కడ రిజర్వాయర్ ఏర్పాటు చేయడానికి అనువైన వసతులు ఉన్నాయా లేదా అనే దానిపై ఆరా తీశారు. పరిమి రోడ్డులోని దోనేపూడి వారి వీధిలో ఎస్‌టీపీ ప్లాంట్‌ను ఏర్పాటుకు పరిశీలించారు.

ఐలవరంలో కార్తిక వన సమారాధన



భట్టిప్రోలు: మండలంలోని ఐలవరం గ్రామ దేవత పైడమ్మ తల్లి దేవాలయం ఆవరణలో సోమవారం 14వ వార్షిక కార్తిక మాస వన సమారాధన ఘనంగా నిర్వహించారు. దీంతో ప్రజల్లో భక్తి, స్నేహ భావాలు పెంపొందాయి. గ్రామంలోని ప్రతి వీధి నుంచి మహిళలు, చిన్నారులు, వృద్ధులు తరలి వచ్చి స్వామివారి ప్రసాదాన్ని అన్న సమారాధనగా స్వీకరించారు. అమ్మవారికి అయ్యప్ప స్వాములు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ పద్మశాలీయ పురోహిత సంఘం అధ్యక్షుడు గోలి ధర్మారావు అమ్మవారికి పూజలు చేశారు. కార్యక్రమాలను భక్త బృందం పర్యవేక్షించింది.

విద్యారంగం అభివృద్ధికి ఆజాద్ కృషి చిరస్మరణీయం



ఆజాద్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కూటమి నాయకులు

బాపట్ల టౌన్: దేశంలో విద్యా రంగం అభివృద్ధికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ అందించిన సేవలు చిరస్మరణీయమని పఠాన్ రాజేష్ తెలిపారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిను పురస్కరించుకొని సోమవారం ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ కార్యాలయంలో ఆజాద్ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. కూటమి నాయకులు పఠాన్ రాజేష్ మాట్లాడుతూ మౌలానా అజాద్ సేవలు నిరుపమానమన్నారు. స్వాతంత్ర్య సంగ్రామంలో జాతి కోసం విశేషంగా కృషి చేశారన్నారు. భారత దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా పనిచేసి విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారన్నారు. ముస్లింల అభ్యున్నతి, దేశ ప్రజల ఐక్యతకు ఆయన చేసిన సేవలను గుర్తించి భారత ప్రభుత్వం భారత రత్న అవార్డు ప్రకటించిందన్నారు. మౌలానా ఆజాద్ పేరిట ఉర్దూ విశ్వవిద్యాలయాన్ని హైదరాబాదులో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. దేశంలో విద్యా వ్యాప్తికి నిర్బంధ ప్రాథమిక విద్యను ప్రవేశపెట్టి ప్రస్తుతం ఉన్న ఐఐటీకు ఆనాడే అంకురార్పణ చేశారన్నారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్, ఇండస్ట్రియల్ టెక్నాలజీ, లేదర్ టెక్నాలజీ, ఇనిస్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్, వంటి ఎన్నో విప్లవతమ్మైన విద్యా సంస్కరణలు చెప్పటిన అక్షర శిల్పి మౌలానా ఆజాద్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో భీమా లీలా కష్ణ, శీలం శ్రీను, తోట నాగేశ్వరరావు, జి దుర్గ ప్రసాద్, బోగిరి రామారావు, చింత కిషోర్, జనసేన నాయకులు కష్ణ, కె.అంజనేశ్, సాయి పాల్గొన్నారు.

కొళాయి కనెక్షన్లకు నగదు వసూలు చేస్తున్నారని ఫిర్యాదు

కొలకలూరులో పైపులైన్లను పరిశీలించిన తహసీల్దార్ గోపాలకృష్ణ



పైపులైన్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

తెనాలిరూరల్: ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ ఆధ్వర్యంలో తెనాలి మండలం కొలకలూరులోని ఎస్సీకాలనీలో వేస్తున్న పైపులైన్ల నుండి తాగునీటి కుళాయి కనెక్షన్‌ల కోసం అక్రమంగా నగదు వసూలు చేస్తున్నారని గ్రామస్తులు సోమవారం సబ్‌కలెక్టర్ సంజనా సింహాకు ఫిర్యాదు చేశారు. కాలనీలో రెండేళ్లుగా తాగునీటి సమస్యతో బాధపడుతున్నామని, మురుగు నీరు వస్తోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. సబ్ కలెక్టర్ ఆదేశాలతో తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ సోమవారం రాత్రి గ్రామలలోని ఎస్సీ కాలనీకి ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో కలసి వెళ్లారు. పైపులైన్లను పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడారు. ఇంటింటికిచ్చే కుళాయి కనెక్షన్‌లకు అక్రమంగా కనెక్షన్‌కు రూ. వెయ్యి చొప్పున వసూలు చేస్తున్నారని గ్రామస్తులు తహసీల్దార్‌కు వివరించారు. ఇప్పటి వరకు 300 కనెక్షన్‌లకు వసూలు చేశారని చెప్పారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ పైపులైన్లలో లీకులు ఉన్నట్టు గుర్తించామని, జిల్లా కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కాంట్రాక్టరుతో ఉన్న ఒప్పందాలు, వివాదాల గురించి ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో చర్చించి ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు.

14న వ్యాస రచన పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని జేకేసీ కళాశాలలో ఈనెల 14వ తేదీ వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.గోపీచంద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెల్‌ఫోన్ వలన సమాజానికి లాభమా!. నష్టమా!. అనే అంశంపై తెలుగు, ఆంగ్ల భాషల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించి తొలి మూడుస్థానాల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. ప్రతి కళాశాల నుంచి ముగ్గురు చొప్పున విద్యార్థులను అనుమతిస్తామని, ఆసక్తి గలవారు వారి కళాశాల ప్రిన్సిపాల్ ధ్రువీకరణ పత్రంతో హాజరు కావాలని సూచించారు.

15న రాష్ట్రస్థాయి చిత్రలేఖన పోటీలు

జేకేసీ కళాశాల మహిళా సాధికారత సమితి ఆధ్వర్యంలో భవిష్యత్ కోసం అమ్మాయిల దృష్టి అనే అంశంపై ఈనెల 15న రాష్ట్ర స్థాయిలో చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ గోపీచంద్ తెలిపారు. ప్రతి కళాశాల నుంచి ముగ్గురు చొప్పున విద్యార్థులు ఐడీ కార్డు, రిజిస్ట్రేషన్ రుసుం రూ.50, ప్రిన్సిపాల్ ధ్రువీకరణ పత్రంతో హాజరు కావాలని సూచించారు.

తాగునీరు వృథా..



సంజీవయ్య నగర్ రైల్వే ట్రాక్ పక్కన పైపులైన్ లీకై వృథాగా పోతున్న మంచినీరు



నెహ్రూనగర్ 8వ లైనులో రోడ్డుపై పారుతున్న నీరు

నెహ్రూనగర్: స్థానిక నెహ్రూనగర్ వాటర్ ట్యాంకుల నుంచి హెచ్‌ఎల్‌ఆర్(వాటర్ ట్యాంకులకు) రిజర్వాయర్‌కు నీటిని పంపింగ్ చేసే ప్రధాన పైపులైన్‌పై లీకులు ఏర్పడి నీరు వృథాగా పోతుంది. సంజీవయ్యనగర్ రైల్వే గేటు వద్ద పెద్ద ఎత్తున లీకు ఏర్పడి కొన్ని లక్షల లీటర్ల నీరు వృథాగా పోవడంతో టెయిల్ ఎండ్ పాయింట్‌లకు(శివారు ప్రాంతాలకు) నీరు సక్రమంగా అందని పరిస్థితి నెలకొంది.

రేపు ఉపకార వేతనాలు పంపిణీ



తులసి యోగీష్

కొరిటిపాడు: షెడ్యూల్డ్ తెగలకు చెందిన విద్యార్థులకు ఉపకార వేతనాలు బుధవారం పంపిణీ చేయనున్నట్లు తులసి గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ తులసి యోగీష్ సోమవారం తెలిపారు. ప్రతిస్పందన ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ 17వ వార్షికోత్సవం సందర్భంగా కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్ గుంటూరు, ప్రతిస్పందన ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ చర్ల సంయుక్త ఆధ్వర్యంలో చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 200 మంది షెడ్యూల్డ్ తెగలకు చెందిన విద్యార్థులకు రూ.7 లక్షలు ఉపకార వేతనాలు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమం ఉమ్మడి ఖమ్మం జిల్లా, చర్లలోని రాహుల్ విజ్ఞాన్ విద్యాలయంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతోందన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తులసి గ్రూప్ చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు హాజరై విద్యార్థులకు వితరణ చేయనున్నట్లు తెలిపారు.

కాలు తొలగించారని ఆత్మహత్య

తెనాలిరూరల్: షుగరు వ్యాధి కారణంగా కాలు తొలగించారన్న మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ ఐతానగర్ శివారు వైవీఆర్ కాలనీకి చెందిన ఆకుల వీరయ్య (35) గతంలో కూలి పనులకు వెళుతుండేవాడు. మధుమేహం వ్యాధి కారణంగా అతని కాలును మోకాలు వరకు తొలగించారు. ఇప్పుడు తొడ భాగాన్ని తొలగించాలని వైద్యులు సూచించారు. దీంతో మనస్తాపానికి గురై ఈ నెల 9వ తేదీన ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. సోమవారం వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు టూ టౌన్ సీఐ నిసార్‌బాషా తెలిపారు.